# ఆంజనేయ దండకము

శ్రీఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం ప్రకీర్తిప్రదాయం భజే వాయుపుత్రం భజే వాలగాత్రం భజేఽహం పవిత్రం భజేసూర్యమిత్రం భజేరుద్రరూపం భజే బ్రహ్మతేజంబటంచున్ ప్రభాతంబు సాయంత్రమున్ నీనామసంకీర్తనల్‌జేసి నీరూపువర్ణించి, నీమీద నే దండకం బొక్కటిఁజేయ నూహించి, నీమూర్తినిన్ గాంచి, నీయందమున్నెంచి, నీదాసదాసుండనై, రామభక్తుండనై, నిన్ను నేగొల్చెదన్, నీకటాక్షంబునన్ జూచితే, వేడుకన్ జేసితే, నా మొరాలించితే, నన్ను రక్షించితే, అంజనాదేవి గర్భాన్వయా! దేవ! నిన్నెంచ నేనెంతవాడన్ దయాశాలివై జూచితే, దాతవై బ్రోచియున్, దగ్గరన్ నిలిచియున్, తొల్లి సుగ్రీవుకున్ మంత్రివై, స్వామికార్యార్థమై యేగి, శ్రీరామసౌమిత్రులం జూచి, వారిన్ విచారించి, సర్వేశు పూజించి, యబ్భానుజున్ బంటుగావించి, యవ్వాలినిన్ జంపించి, కాకుత్థ్సతిలకున్ దయాదృష్టి వీక్షించి, కిష్కింధకేతెంచి, శ్రీరామ కార్యార్థివై, లంకకేతించియున్, లంకిణిన్ జంపియున్, లంకనున్ గాల్చియున్, భూమిజన్ జూచి, యానందముప్పొంగి యాయుంగరంబిచ్చి, యారత్నమున్ దెచ్చి, శ్రీరామునకున్నిచ్చి, సంతోషమున్ జేసి, సుగ్రీవునిన్ అంగదున్ జాంబవంతాది నీలాదులన్ గూడి, యాసేతువున్ దాటి, వానరుల్‌మూకలై పెన్మూకలై యాదైత్యులన్ ద్రుంచగా, రావణుండంత కాలాగ్ని రూపోగ్రుడై వచ్చి, బ్రహ్మాండమైనట్టి యాశక్తినిన్ వేసి, యా లక్ష్మణున్ మూర్ఛనొందింపగా నప్పుడేపోయి సంజీవినిన్ దెచ్చి, సౌమిత్రికిన్నిచ్చి ప్రాణంబు రక్షింపగా, కుంభకర్ణాదులన్ వీరులన్ బోరి, శ్రీరామబాణాగ్ని వారందరిన్ రావణున్ జంపగానంత లోకంబు లానందమైయుండ నవ్వేళనన్, విభీషణున్ వేడుకన్ దోడుకన్ వచ్చి, పట్టాభిషేకంబుజేయించి, సీతామహాదేవినిన్ దెచ్చి,

# ఆంజనేయ దండకము

శ్రీరాముతోఁజేర్చి, అయోధ్యకున్ వచ్చి, పట్టాభిషేకంబు సంరంభమైయున్న నీకన్ననాకెవ్వరున్ గూర్మిలేరంచు మన్నించినన్ శ్రీరామభక్తి ప్రశస్తంబుగా నిన్ను సేవించి నీనామసంకీర్తనల్ చేసినన్ పాపముల్ బాయునే భయములున్ దీరునే భాగ్యముల్ గల్గునే సకల సామ్రాజ్యముల్ సకల సంపత్తులున్ గల్గునే వానరాకార! యోభక్తమందార! యోపుణ్యసంచార! యోధీర! యోవీర! నీవే సమస్తంబుగా నొప్పి యాతారక బ్రహ్మ మంత్రంబు పఠియించుచున్ స్థిరముగా వజ్రదేహంబునున్ దాల్చి, శ్రీరామ శ్రీరామ యంచున్ మనఃపూతమై యెప్పుడున్ దప్పకన్ తలచు నా జిహ్వయందుండి నీ దీర్ఘదేహంబు త్రైలోక్యసంచారివై, రామ నామాంకితధ్యానివై బ్రహ్మవై, బ్రహ్మతేజంబునన్ రౌద్రిణీ జ్వాల కల్లోల హావీర హనుమంత! ఓంకార హ్రీంకారశబ్దంబులన్ భూత ప్రేతంబులన్ బెన్ పిశాచంబులన్ శాకినీ, డాకినీ, మోహినీ ఇత్యాది గాలిదయ్యంబులన్ నీదు బాలంబునన్ జుట్టి నేలంబడంగొట్టి నీ ముష్టిఘాతంబులన్ బాహుదండంబులన్ రోమఖండంబులన్ ద్రుంచి, కాలాగ్ని రుద్రుండవై నీవు బ్రహ్మప్రభాభాసితంబైన నీదివ్యతేజంబునున్ జూచి రారోరి నాముద్దునరసింహాయంచున్, దయాదృష్టివీక్షించి, నన్నేలు నాస్వామీ ఓ ఆంజనేయా నమస్తే సదా బ్రహ్మచారీ! నమస్తే ప్రపన్నార్తి హారీ! నమో వాయుపుత్రా! నమస్తే నమస్తే నమః.

K Praveen Achary Vishwakarma (Baspally). Related Posts Visit- https://stotra.online